


విజయావారి గుండమ్మ కథ (1962) సినిమా నిజానికి ఒక కన్నడ చిత్రం. పేరు మనె తుంబెద హెణ్ణు. జానపద బ్రహ్మ విఠలాచార్య తీశారా సినిమా. కన్నడిగుడు అయిన విఠలాచార్య ఆ సినిమా నిర్మాణానికి తగిన ఆర్థిక స్థోమతు లేక మద్రాసు వచ్చి వాహినీ స్టూడియోలో తీశారు. నాగిరెడ్డిగారు ఆయనకు స్టూడియో సదుపాయాలన్నీ ఉచితంగా అంద చేశారు. అందుకు ప్రతిగా ఇతర భాషల్లో ఆ కన్నడ చిత్రం పునర్ నిర్మించుకునే హక్కులు తనకు రాయించుకున్నారు. కన్నడ చిత్రాన్ని చాలావరకు మార్చి తెలుగు తమిళాల్లో గుండమ్మ కథ, మనిదన్ మారవిల్లయ్ పేరిట తీశారు. రెండు భాష ల్లోనూ ఆ కథ అఖండ విజయం సాధించింది. గుండమ్మ స్వంత కూతురు సరోజకు బుద్ధిరావ డంతో ఆ సినిమా ముగుస్తుంది. తరువాత ఏం జరిగింది? చక్ర పాణిగారికి ఈ కథకు కొనసా గింపు రాస్తే బాగుండునని అని పించింది. సరదాగా రెండో భాగం రాశారు. అదే గుండమ్మ కూతుళ్ల కథ. భారతి సాహిత్య మాస పత్రిక 1964 మార్చి సంచికలో ప్రచురితమై అప్పట్లో సాహిత్యాభిమానులను విశేషంగా ఆకర్షించింది. అయితే, ఈ కథను ఎందుకనో విజయావారు సిని మాగా తీయలేదు. చాలా సంవత్సరాలు అలాగే అనామకంగా పడి వుంది. గుండమ్మ కథకు సంభాషణలు రాసిన డి.వి. నరసరాజు గారి చొరవతో 1982లో ఈ కథ కూడా సినిమాగా వచ్చింది. అదే వయ్యారిభామలు వగలమారి భర్తలు. నందమూరి, కృష్ణ, శ్రీదేవి, రాధిక నటించారు. కట్టా సుబ్బారావు దర్శకుడు. ఆర్.వి. గురుపాదం నిర్మాత. నలభై మూడేళ్లనాటి ఆ కథ మా పాఠకులకు ఆసక్తిగా వుంటుందని ఈ దీపావళి ప్రత్యేక సంచికలో పునఃప్రచురిస్తున్నాం.

# గుండమ్మ కూతుళ్ల కథ

## చక్రపాణి

పురజనుల కోరికమీద, రామభద్రయ్యగారు కొడుకుల చేత సత్యనారాయణ వ్రతం, బీదలకు అన్నదానం చేయించ నిశ్చయించుకున్నాడు. ఆ ప్రకారం ఆహ్వాన పత్రాలు అచ్చు వేయించి, బంధుమిత్రులకు పంపటం జరిగింది.

గుండమ్మ కొడుకు ప్రభాకర్ ఆహ్వానం అందుకుని బయలుదేరబోతుండగా గంటయ్య తనకూ ఆహ్వానం వచ్చిందనీ, (రాకపోయినా) 'ఒక్కణ్ణే ఏం పోను' అని ఆలోచిస్తున్నాననీ, 'సరే, మీరు బయలుదేరుతున్నారు గాబట్టి, మీకు తోడు నేనూ వస్తా'నని ప్రభాకర్ పెట్టే, బెడ్డూ తీసుకుని బయలుదేరాడు.

